## పట్టణ జీవితాన్ని గురించి పల్లెటూరి చిన్నోడి అనుభవం!

అలిసిపోయి గూళ్ళకు చేరుతున్న పక్షుల్లా బస్సులొక్కొక్కటీ పై ఊళ్ళనుంచి సి టీ బ స్ స్టాండుకు చేరుకుంటున్నాయి. స్టేషన్ కాంపౌండ్ గోడకానించి రిక్షాలు, ఎదురుగా రోడ్డు కవతల మూసీ నదికి కట్టిన పిట్టగోడ వెంబడి కొన్ని టాక్సీలు, వాటికో మూడింతలు ఆటోలు చాంతాడులా బారున నిల్చుని వున్నాయి.

బస్సులు దిగిన జనాన్ని తమ గమ్యస్థానాలకు చేర్చటం వాటిపని! అవి ఎంతోమంది పేద ప్రజల జీవితాలకు ఉపాధికల్పిస్తున్నాయి! బస్సులు దిగిన జనాన్ని ప్రహరీగోడ దాటి ఇవతలకు రానీకుండా కొంతమంది రిక్షా వాళ్ళు ప్రయాణీకుల చేతుల్లో నుంచి లగేజీని లాక్కుని వాళ్ళను తమతో తీసుకుపోవటానికి ప్రాకులాడుతున్నారు!

కొందరు ప్రయాణీకులు దర్జాగా లగేజీ వాళ్ళ కందించి వాళ్ళు చరచరా పరుగెత్తి పోతుంటే అవి ఏమైపోతాయోనన్న కంగారుతో వాళ్ళ వెనకాలే జనాన్ని తోసుకుంటూ లగెత్తుతున్నారు. బయటికి మరి కొంతమంది రిక్షావాళ్ళ చాతుర్యానికి లొంగక తప్పించుకుని బయటికి నడుస్తున్నారు వడివడిగా!

ఇంతలో జనంతో కిటకిటలాడుతున్న బస్సొకటి వచ్చి ప్లాట్‌ఫాంమీద ఆగింది ఉసూరుమంటూ. బిలబిలమంటూ జనం దిగుతున్నారు!

బస్సంతా ఖాళీ అయినా పోలయ్య ఇంకా కూచునే వున్నాడు. అతని కళ్ళు ఎవరికోసమో ఆత్రంగా వెదుకుతున్నాయి. తన వాళ్ళ జాడ కనపడకపోయేసరికి పోలయ్య కళ్ళు భయంతో బిక్కుబిక్కుమంటున్నాయి!

పది నిమిషాల తర్వాత డ్రైవర్ మళ్ళీ బస్సెక్కాడు.

కిటికీలోంచి తల బయటపెట్టి వెర్రి చూపులు చూస్తున్న పోలయ్యతో—

"ఏం దొరా! ఇంకా కూకున్నవు? హైదరాబాదిదే! ఇక దిగు. బండి షెడ్ల పెట్టాల" అన్నాడు సిగరెట్ దమ్ము లాగుతూ.

"వుండు సార్! దిగుతా! మా మావ వస్తనంటని చెప్పిండు డిపూకాడికి! రానట్టె కొ డు తుంది! యిక మల్ల నేను మా వూరికి పోబకతదో ఏందో! అల్లేడుంటరో నా గ్గుర్తులేదు!" అన్నాడు పోలయ్య. అతని కంఠంలో భయమూ, అమాయకత్వమూ వ్యక్తమయ్యాయి.

"అరె! కిందిగి దిగి దేవులాడవయ్యా. ఇంతమందిల అల్లేడున్నరో! దమాక్ ఖరాబు చెయ్యకు. దిగుదిగు 'జల్దీ గో' అంటూ కోపగించుకుని బస్సు స్టార్ట్ చేశాడు డ్రైవర్.

"దిగుత ఉండువయా! ఇదేం నాజాతి బస్సంట నన్ననా నేను! గట్ల కోప్పడ తవూ!" అంటూ తన పెట్టె, మూటా తీసుకుని హుషావిడిగా దిగాడు పోలయ్య.

బస్సులోనుంచి ఒక్క ఉదుటున యువ తలపడ్డ పోలయ్య చేతిలోని పెట్టెను తన చేతిలోకి తీసుకోవటానికి ప్రయత్నం చేస్తూ

"కాఁ జానా హై భాయ్" అంటూ ఆప్యాయంగా అడిగాడు ఓ గళ్ళలుంగీ రిక్షావాలా.

పోలయ్యకు భాష రాదు. కొత్త ప్రదేశం! అదురుతో వణుకుతూ,

"మీ బాస నాకు రాదు. నేను మా మావ కోసం దేవులాడుతున్న" అంటూ బయటి గేటువైపు నడిచాడు.

"ఏడికి పోవాల్నె?" ఎదురుగా మరో రిక్షా అబ్బి ప్రశ్నించాడు. పోలయ్య నదురు, బెదురు గమనిస్తూనే.


"అది తెల్వకనే నేస్తూ స్తన్నన్నా! మావను రమ్మంటిని. కారటేసుంటి. మనోడు రానట్టే కొడుతుంది. నా కీడ పట్నంల ఎవ్వలు తెల్వరు. ఇగ ఆయన రాకుంటే నేనిట్లకెల్లి యిట్లనే మల్లిపో వాలె!!" అంటూ కాస్త దగ్గరిగా వెళ్ళాడు పోలయ్య.

"పయిలీ దఫా వస్తున్నట్లున్నవు! ఏ బస్తీలుంటడో సెప్పరాదూ" పీలైతే తను చేరుస్తానన్న భరోసా ధ్వనించింది తలగుడ్డ రిక్షావాడి గొంతులో.

"బస్తీ పేర్పె తెల్వదు! అప్పట్నావ మా వూరొచ్చినప్పుడు ఏదో చెప్పిండు. యాదుకొస్తలేదు" అంటూ తల గోక్కున్నాడు పోలయ్య.

"యాదకొలువుండు! గదన్నా గుర్తు తమీస్త" అమాయకుడికి సహాయం చేద్దామన్న తలంపుతో అడిగాడు రిక్షా అతను.

"ఎహే! గాడేం సవాలనుకున్నవా? ఏదో అల్తుపొల్తుగాడు. రిక్ష గొడుతుండు. పేరు యాదయ్య. నీగ్గిన గుర్తున్నా" ఒక్క పేరు చెబితే చాలు. మనిషి అడ్రసు



తెలుస్తుందెమో నన్న ఆశతో అడిగాడు పోలయ్య.

"అరె నీ యవ్వ ! నువ్వు బలేవున్నవు యాదయ్యా నెటోల్లు ఎంత మంది లేరీ దునియల. వతా తెల్వొందెట్లనయా?" కాస్త విసుగ్గా అన్నాడు రిక్షా అతను.

"అరేయ్ పోలిగా ! వచ్చినావురా. అరె .... నీ కోసమంటని నేను లోవటంత దేవులాడొస్తున్నరా ! నువు గీడున్నావ్!" అంటూ ఒక్కవురుకున యాదయ్య వచ్చాడు లోపలినుంచి.

"అరె ! వ్వా ! నువు బలేవున్నవు. నీ కోస మంటని అప్పట్సంది నేనీడంతా దేవులాడబడిత్ని !" అన్నాడు పోలయ్య! యాదయ్యను కల్సుకున్న సంతోషం పరవళ్ళు తొక్కుతుండగా పళ్ళికిలిస్తూ.

"నేనేడికి పోయినరా ! గాడలోపల స్టాండింకాడనే వుంటిని. నువ్వెట్లకెల్లి యెల్లినవు ఉను తప్పించుకుని. బలే ఎల్లినవు బిడ్డా దొంగలెక్క. నీ చాల్ బాజీ యింకా తక్కువకాలె ! ఆఁ....గద్సరే ! మీ నాయన, అమ్మ గిట్ల బాగున్నరా ఇంటికాడ ? నడునడు యింటికిపోదాం" అంటూ సమాధానం వినకుండానే అడుగులు ముందుకేశాడు యాదయ్య.

"పోతున్నా అన్నా. మామావొచ్చిండు" అని తనను ఆప్యాయంగా పలకరించిన రిక్షా అతనికి చెప్పి యాదయ్య వెనకాలే నడిచాడు పోలయ్య.

యాదయ్య వడివడిగా జనాన్ని, వాహనాల్ని తప్పించుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు దూరంగా వుంచిన తన రిక్షా వైపు. ఆ వెనకాలే తన లగేజి నెత్తిన పెట్టుకుని నడుస్తున్నాడు కాళ్ళీడ్చుకుంటూ పోలయ్య.

"రాబే జల్దీ !" అంటూ కోప్పడ్డాడు యాదయ్య రిక్షాను చేరి వెనక్కు తిరిగి చూసి.

"ఆఁ ఆఁ! వస్తున్ననే" అంటూ వెళ్ళి రిక్షాలో సామానుపడేసి కూచున్నాడు పోలయ్య.

యాదయ్య బీడీ దమ్ము లాగి హుషారుగా రిక్షా ఎక్కాడు.

"అక్క, పోరలు గిట్ల బాగున్నరా మావా?" అని ప్రశ్నించాడు పోలయ్య.

"ఆఁ ఆఁ అందరం బాగానే వున్నం!" అన్నాడు యాదయ్య వెటకారంగా రిక్షాను జోరుగా తొక్కుతూ.

మావ కీమధ్య కోపమెక్కువైందని అక్క వుత్తరం రాయించింది. కాస్త జాగ్రత్తగానే మసలుకోవాలి అనుకున్నాడు పోలయ్య మనసులో.

అప్పటికి యాదయ్య రిక్షా స్టేట్ లైబ్రరీ సమీపించింది. ఎదురుగ్గా అల్లంత దూరాన్నుంచి తనువైపే రాక్షసుడిలా గర్జిస్తూ వస్తున్న వాహనాన్ని చూసి బెదిరిపోయి-


"గిదేంది మావో.... మోటరు మీద మోటరు జమాయించి జుడాయించినట్లుగాడుతుంది. అరె మీద కూకున్నోల్లు కింద పడరారె !" అన్నాడు పోలయ్య కాస్త బిగ్గరగానే.

"అరె ! వర్లకురా ! దీన్ని డబల్ బస్సంటరు. దీని తయ్యారి ఖుచ్ గిట్లుంటది ! మీద కూకున్నోల్లు పడరుబే ! మనం భీ ఎక్కుదాం ఈతాప" అన్నాడు యాదయ్య కసురుకుంటూ.

"అరె గింత పెద్ద దవాఖానా ఏవిటోరా! మీ పట్నంలో అందర్కీ రోగాలున్నట్లున్నయి ఎన్ని మందొలేస్సిర్రో లోపట? ఇంతగణం రోగాలుంటే మీరెట్లుంటుంటిరే పట్నంలా?" అన్నాడు పోలయ్య ముక్కున వేలేసుకుని.

"అరేయ్ నువ్వొర్లకురా! గిదేం పట్నమనుకున్నవా! లేకపోతే మనూరనుకున్నవా? ఈడ లచ్చల కొద్దీ పబ్లికుంది. మరంతమందికి సాలాల్నంటే దవాఖానా జర పెద్దగనే వుండాల? పెద్ద పెద్ద శాక్టర్లుంటరీడ. ఇన్ల దున్య రోగాలకి లాజుంటది" వివరించాడు యాదయ్య.

"గట్నానె" అని వూరుకుండిపోయాడు పోలయ్య.




రిక్షా మరి కాస్త ముందుకు పోయింతర్వాత, పోలయ్యకు ఎదురుగా ఎత్తైన గోపురాలు కనపడేసరికి.

"నైజాం నవాబ్ సాబిల్లా మావా గది" అంటూ చేయి చూపిస్తూ అడిగాడు ఆసక్తిగా.

"అరె హవులా ! గది దవాఖానారా ! ఉస్మానియా దవాఖానా ! నవాబ్ సాబ్ కట్టిచ్చిండంట. అందుకే ఆయన పేర్తోనుంది" అన్నాడు యాదయ్య నవ్వుతూ.

యాదయ్య మాత్రం నాంపల్లి చౌరాస్తాకు చేరేదాకా మేనల్లుడికి దార్లోని వీధుల పేర్లు. బిల్డింగ్‌ల ప్రాముఖ్యత చెబుతూనే వున్నాడు.

పరిసరాలు పరికించటంలో మునిగిపోయాడు పోలయ్య.

సడన్‌గా రిక్షా అపాడు యాదయ్య.

"ఏంది మావో, రిక్షా ఆపినవు?" అన్నాడు పోలయ్య అదేదో వింతైనట్లు.

క్రాస్‌రోడ్డు దగ్గర్నుంచే నాంపల్లి స్టేషన్ను చూపించి—

"అరేయ్ పోలిగా! ఇదేరా నాంపల్లి రేల్ టేషనూ! గిది పట్నంల పెద్దటేషను. గీడ, ఇంకా బస్‌డిపు కాడ, సినిమ టాకీస్ల కాడ జర గిరాకి బాగుంటది మనకు. అందుకే ఒకటకిగితాన. ఓ అర్ద ఎక్కువనే అడగాల! నీ అట్లాసుంటోడితాన రెండూ మూడు భీ యెక్కువ గుంజొచ్చు! ఏదైన మోఖాచూసి అడగాలె! గివన్నీ కిట్కు లన్నట్టు! మరి యిగ నువ్వ అవ్వాగా నిట్టుగ కూకున్నవంటే, బిడ్డా దొక్కలెండుతయి! జర కమాంచేడ్డి నేర్వాలె! ముందు రెండు దినాలు రిక్షా కొట్టేడిది నేర్వు. నే నేర్పుతా! మీ నాయన కారటేసిండు. మే మీద రాజ్జా లేలున్న మనుకున్నడో ఏందో. నిన్ను దోలిండు. ఇక ఎట్ల బతుకతవో ఏందో. కష్టం చెయ్యాలి గింత తాగాలె. తినాలె! బస్ మన జిందగీ అయిపాయె! మనకి తెల్సింది చెప్పినం! ఇగ నీ యిష్టం!"

పట్నవాసంలో పేదజీవిత విధానాన్ని పూసగుచ్చినట్లు చెప్పాడు యాదయ్య.

ఊళ్ళో తంతే, వచ్చి ముళ్ళగంపలో వడ్డానా ఏమిటి అనుకున్నాడు పోలయ్య! మనసు నిరుత్సాహంతో నిండిపోయింది.

యాదయ్య మళ్ళీ రిక్షా ఎక్కబోతుండగా— మేనల్లుడికో చా కొట్టిస్తే బాగుంటుందన్న వూహ మెదిలింది మనసులో.

పక్కనే వున్న బడ్డీకొట్లో ఒక టీ తీసుకొని చెరిసగం తాగారిద్దరూ!

* * *

రిక్షా ఇల్లు చేరేసరికి మరో గంట పైనే పట్టింది! ఇంట్లో లచ్చిగాని, పిల్లలు గాని లేక పోవటంతో యాదయ్యకు చిర్రెత్తుకొచ్చింది.

యాడికిపచ్చిర్నో! కొంపల ఒక్కలీ! దా పోలిగా, లోపటికిరా!" అన్నాడు యాదయ్య రుసరుసలాడుతూ.

పోలయ్య దిక్కులు చూస్తూ ఇంట్లోకి వెళ్ళాడు! నెత్తిమీది పెట్టె, చేతిలోని మూటా ఓ వారగా పెట్టి—

"వ్వా! మావా! గిదేందేవ్! ఇట్ల




ఏ నాడైనా మా బ్రతుకులకు,
ఏమున్నది గర్వకారణం?
ఒక నాడు బావిలో కప్పలం!
ఈ నాడు ఒడ్డున పడ్డ చేపలం.

—గోరంట్ల వాణీదేవి

పాడైందికొంప? మీదన్ని పొక్కలే కన బడుతున్నయి! గోడల్సీ కూలెటట్లే వున్నయి! అరె నీ యమ్మ! గీ దర్వాజేం దర్వాజేవ్, గిట్లుందీ? ఒక్క లాత్తంతే వూడిపోతది. ఇంతకన్న మంచిల్లు దొర్కలేదానే?" అంటూ పక్కనే వున్న పీటేసుకుని కూచున్నాడు.

"ఆఁ ఆఁ! దిగిండయా నవాబ్ సాబ్ కొడుకూ! గిదొస్తుండంటని నేను బంగ్ల దీసుకుంట! అరె బే, గిదేం జంగంపల్లను కున్నావ్! పట్నం బిడ్డా! మన కిస్మత్కి యిదయినా వుంది. ఇంత భీ లేనోల్లు ఎందరున్నరో నీకేం గుర్తు. మల్లగూడ జర యింటామె మంచిదాయెపట్కె ముప్పయి రూపాయల కిచ్చింది కిరాయకి. బంగ్లల్ల వుండాలంటే ఏయిలు, ఏయిలు గావాల్రా" అంటూనే కుండలోని నీళ్ళు తెచ్చిచ్చాడు యాదయ్య.

ఆ నీళ్ళు తాగేసరికి కడుపు చల్లబడినట్లయింది పోలయ్యకు.

"ఏంది మావా! సీకటి కాబట్టే అక్క రాకపాయె! పోరల్సీలేరింట్ల! ఏడికి పోయిండ్రో?" అనడిగాడు పోలయ్య దొక్క విప్పుతూ.


"పెద్ద పోర్లిద్దరూ కూల్నించి వస్త పట్కె బాగనే సీకటయితది! ఇగ మీ అక్క.... ఆఁ యియ్యాల పదారు తారీక్లే! కూలి మాని పొద్దటి సంది రాషన్ దుకాన్కాడ్నే కూకుండొచ్చు! గిదో పంచాయితీ! రాషన్ రానే రాదు! వచ్చిందన్నా మనగ్గనపడదు: ఆ సాలెగాండ్లు బిలాకు జేస్తరంట: ఏ నెలకానెల గిదే సావనుకో! అన్ని సామాన్లు ఒక్కసారే దొరకవుగదా! రాషన్ కోసమంటని నెలలా ఓరం దినాలు కూలి పోగొట్టుకోవాలె! ఊఁ! నువ్విడ్నే కూకో! నేనోపోయి మీ అక్కని తోల్తా" అని గబగబ బయటికెళ్ళి రిక్షా ఎక్కాడు యాదయ్య.

ఆలోచనలతో సతమతమవుతూ పోలయ్య అకస్మాత్తుగా పైకి చూశాడు. ఆకాశంలో మిలమిలలాడుతున్న నక్షత్రాలు కనిపించాయి! గుండెలు బేజారయిపోయాయి: తన తండ్రి అబద్ధంచెప్పాడు అనుకున్నాడు! వీళ్ళ గురించి ఊళ్ళో చాలా గొప్పగా ప్రచారం చేస్తుంటాడు! వాస్తవం చూడబోతే కళ్ళకు కట్టినట్లుగా వుంది! లచ్చక్కని కూచోబెట్టి మహరాజులా ఏలుకుంటున్నాడనుకుంటున్నారు తాము. తీరా చూస్తే పిల్లల్నికూడా వంగబెడుతున్నాడు పనికి! పట్నంలో బతుకులింతేనన్నమాట! ఛీ!

పోలయ్య ఆలోచనా స్రవంతికి ఆనకట్టపడింది! అదేసమయానికిగట్టిగాఏడుస్తూ లచ్చి రావటం గమనించాడు. కంగారుగా లేచి—

"ఏంటిదక్కా, ఏమైంది! గిట్లేడుస్తున్నవు?" అన్నాడు పోలయ్య.

"నాలుగ్గొట్టంగ రాషన్ దుకాన్కాడికి బియ్యంకోసమంటని పోయిన్న తమ్మీ! గాడపట్కె పెద్ద లైనుంది! గీ బుడ్డదాన్నెత్కని నిలబడ్డ లైన్ల! పొద్మీకెటపట్కె దీని పెయ్యికాలబట్టింది. ఓ రెండు సార్లు అంతులీ చేసుకుంది.



దవాఖానాకు కొంటబోదమంటే బియ్యమై పోతయని బుగుల్తోని గట్లనె నిలబడ్డలైన్ల. పైంకు మావటీ లేదు. గిప్పుడొచ్చింది. అర్థగంటనుంచి కళ్ళుతెరు స్తలేదు బుడ్డది. నువ్వీడ్నే వుండుతమ్మీ. నేనిప్పుడే వస్తా" అని ఓ మూలనున్న ట్రంకు పెట్టెలో నుంచి డబ్బు తీసుకుని బయటికి పరుగు దీసింది లచ్చి.

* * *

పట్నవాసంలో వారం రోజులు భారంగా దొర్లిపోయాయి పోలయ్యకు.

ఓ రాత్రి దాదాపు పదకొండు గంటల సమయం।

పోలయ్య. లచ్చి. పిల్లలు యింటి ముందు నెరాపిలో నిద్రపోతున్నారు.

ఉన్నట్లుండి నిశ్శబ్ద వాతావరణాన్ని విచ్ఛిన్నం చేస్తూ మూలుగు వ్యాపించిందక్కడ।

లచ్చి. పోలయ్య కలవరపాటుతో లేచి కూచున్నారు.

తలకి కట్టుతో తూలిపోతున్న యాదయ్యను చూసి ఇద్దరూ నిర్ఘాంతపోయారు. వెంటనే ఇద్దరూ యాదయ్య రెక్కలు పట్టుకుని ఇంట్లోకి చేర్చారు.

"ఏంటిది మావా। పట్టి గట్టుకున్నవు. ఏమైంది। ఎడ్నన్నా తాగ్గిన పడ్డవా ఏంది" అంది లచ్చి మండిపడుతూ.

"కాదే। నీయమ్మ దొంగలంజ కొడుకులు రిక్షలో కూకోని దున్నపోతు లెక్క దునియంత తిప్పినంక పైసలడ్గితే నెత్తి పలగ్గొట్టిర్నే ఆ గుండాగాండ్లు। మన చారి దాక్టర్తానికి పోతే. ఓ సూదిచ్చి గీపేల్క గట్టి యియాల్టి కమాయి పదిరూపాల్నూకిండాయన" అని నీరసంగా కూలబడ్డాడు యాదయ్య.

* * *

పోలయ్య పట్నవాస జీవితచర్మనానికి మరో వారం కలిసింది। గడిచిన పక్షం రోజుల్లో జరిగిన రెండు సంఘటనలకే అతని మనసు వికలమవడంతో ఓ నిర్ణయాని కొచ్చాడు। తిండిగింజల వేటలో బిడ్డను బలిచేసుకుంది అక్క। మావ గతి దావు తప్పి కన్ను లొట్టపోయినంత పనయింది। అంతే ఈ పట్నంలో బతుకు దినదినగండ మన్నమాట। ఇదో బతుకేనా। అమ్మో। ఇట్లాంటి నరకంలో తను వుండగలడా?

ఆ రోజు పొద్దుటినుంచే ఆలోచనలతో కొట్టుమిట్టాడిపోతున్న పోలయ్య యాదయ్య కేక విని రివ్వున బయటికెళ్ళాడు

"అరేయ్ పోలిగా. నీ కోసం కిరాయికి రిక్షా కొంటొచ్చిన। ఇగ ఇయ్యాలట్నుంది నేర్పేడిది షురూజెయ్యి। మీ అక్క కాల్మొక్కరా" అన్నాడు యాదయ్య.

ఏం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిన పోలయ్య. కాసేపటికి బయటికొచ్చాడు.

అతని వాలకం చూసి విస్తుపోయాడు యాదయ్య। తమ్ముడి వెనకాలే వచ్చిన లచ్చి–

"ఎంది మావో। గిదిటెల్లిందూ. పెట్టె మూటతోనీ" అంది ఆశ్చర్యంగా.

"ఏం రో, పిలేటు పిరాయించినట్టు గొడుతుంది। రిక్ష నేర్వవా?" అన్నాడు యాదయ్య ఏదో గ్రహించినట్లు.

"సాల్నే। మస్తయింది। గీపట్నం బల్సినోల్లకే। మసట్లాసంటోల్లు ఆళ్ళ కోసమంటని నెత్తురు ఖర్సు చెయ్యాలె। నీ యమ్మ, ధూ. పట్నంకున్న పారేతు. ఈడ ఎంత పేగుతెంచుకున్నా. మనిషి పానాన్కి భీ భరోస లేకపాయి। గిదే కష్టం వూళ్ళ జేస్కుంటే పికర్లేకుండ వుంటొచ్చు। కొంచెం తిన్నా పెయ్యికి పత్తది। నేనిగ యీడుండనే। నాయనేమన్నా అన్ని. వూరికి పోతా। నీ కాల్మొక్కుతా, నన్ను బస్సెక్కిపించు। ఎట్ల బతికినా పల్లెల్నే పైలం।" అంటూ అక్క. మావకు దండంబెట్టి రిక్షా ఎక్కి కూచున్నాడు పోలయ్య. తన నిర్ణయానికి తిరుగు లేదన్నట్లు.

## మన మెజీషియన్లు

### ప్రొఫెసర్ ఓ. హనుమంతరావు M. B. M. C

మెజీషియన్ అండ్ యాక్టర్



ఇంద్రజాల కళకి అయస్కాంతం లాంటి ఆకర్షణ శక్తి ఉంది. అందుకే అది ఒకసారి నేర్చుకున్న వారెవరూ ఆ విద్యను వదలరు. అటువంటి విద్యను చేపట్టిన ప్రొఫెసర్ హనుమంతరావుగారు ఇప్పటికి అరవై ఎనిమిది సంవత్సరాలు వచ్చినా ఉత్సాహంగా, చురుగ్గా ప్రదర్శన లిస్తూనే వున్నారు. జాతీయ స్థాయిలోవున్న మెజీషియన్ల వద్దవుండే అన్ని పరికరాలను సమకూర్చుకుని చక్కని ప్రదర్శన లిస్తున్నారు. ముఖ్యంగా "జిగ్ జాగ్ లేడీ" అనే స్త్రీని మూడుముక్కలుగా కోసే అంశం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది.

కడప జిల్లా. రాయచోటి గ్రామంలో జన్మించి. అదే గ్రామానికి పదేళ్ళు కరణంగా పనిచేసి. తరువాత కొన్నాళ్ళు మిలిటరీలో వుండి. చివరకు కడప చేరి, అక్కడ స్థిరపడిన రావుగారు ఇంతవరకు ప్రశంసనీయమైన ప్రదర్శనలెన్నో ఇచ్చి. ఆదుర్తి సుబ్బారావు. రాజబాబు వంటి ప్రముఖులచే సత్కారాలు పొందారు.

రావుగారు మంచి మెజీషియనే కాదు– చక్కని నటుడు కూడాను. లెక్కకు మించిన నాటకాలు వేసి పరిషత్తులలో బహుమతులు పొందారు. అంతే కాదు రేడియోలో కూడా పలుమార్లు నాటికలలో పాల్గొన్నారు. జ్యోతిష్యము. సాముద్రికము. కవిత్వంతోకూడా పరిచయం వుంది.

అన్ని తరగతులవారినీ. అన్ని వయసులవారినీ ఆనందింపచేసే ఈ "మాజిక్" కళను గుర్తించడానికి ప్రభుత్వం ఎందుకు సంకోచిస్తుందో తనకు అర్థం కావటం లేదనీ, కనీసం రాబోయే తరం వారికైనా ఆ సౌకర్యం కలుగుతుందని ఆశిస్తున్నానంటున్నారు। చిరునామా: 5/46 A, బ్రాహ్మణవీధి. కడప–516 001.

—బి. వి. పట్టాభిరామ్
మెజీషియన్